జోగుళాంబ గద్వాల జిల్లాలో దీక్షా దివస్‌కు ర్యాలీగా వస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జోగుళాంబ గద్వాల జిల్లాలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

మల్దకల్ మండల కేంద్రం నుంచి గద్వాల జిల్లా కేంద్రానికి తరలివెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

అలంపూర్ చౌరస్తాలో ఎమ్మెల్యే విజయుడితో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు

వనపర్తిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భారీ కటౌట్‌కు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, చిత్రంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

కదిలిన గులాబీ దండు

- **దీక్షా దివస్‌కు తరలిన బీఆర్ఎస్ సైన్యం**
- **జిల్లా కేంద్రాలకు బైక్‌లు, కారు, బస్సుల్లో వెళ్లిన కార్యకర్తలు, నాయకులు**

గోపాల్‌పేట, నవంబర్ 29 : జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్‌కు మండలం నుంచి భారీఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాలరాజు, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు తిరుపతి యాదవ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్, సింగిల్ విండో చైర్మన్ గువ్వల రాములు, ఎండీ మతిన్, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెబ్బేరు మండలం నుంచి..

పెబ్బేరు, నవంబర్ 29 : వనపర్తిలో శుక్రవారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి పెబ్బేరు మండలం నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు తరలివెళ్లారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాములు, పట్టణ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డిల ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి స్థానిక తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి అమరవీరులను స్మరించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎల్లారెడ్డి, రామకృష్ణ, నాయకులు వెంకటేశ్, రాజశేఖర్, రమేశ్, వీరస్వామి, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌కు భారీగా తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

అలంపూర్ చౌరస్తా, నవంబర్ 29 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న దీక్షా దివస్ కార్యక్రమానికి శుక్రవారం బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. అలంపూర్ చౌరస్తా వేదికగా ఎమ్మెల్యే విజయుడు ఆధ్వర్యంలో అలంపూర్, మానవపాడు, ఉండవల్లి, వడ్డేపల్లి, రాజోళి, అయిజ, ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాలకు చెందిన వేలాది మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కార్యక్రమానికి తరలివెళ్లారు. అలంపూర్ చౌరస్తా నుంచి గద్వాలకు వేలాది వాహనాల్లో, బైక్‌లో తరలివెళ్లారు. దీంతో రహదారి మొత్తం బీఆర్ఎస్ జెండాలు, వాహనాలతో కళకళలాడాయి.

మల్దకల్ మండలం నుంచి..

మల్దకల్, నవంబర్ 29 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి మల్దకల్ మండలం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు తరలి వెళ్లారు.

ధరూర్ మండలం నుంచి..

ధరూర్,నవంబర్ 29 : మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జిల్లా కేంద్రంలో నిర్వహించే దీక్షా దివస్‌కు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశ్ నాయక్, అబ్రహం ఆధ్వర్యంలో శుక్రవారం బైక్‌లపై కార్యకర్తలు జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు.

అయిజ మండలం నుంచి..

అయిజ, నవంబర్ 29 : జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ దీక్షా దివస్‌కు అయిజ పట్టణ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఎత్తున తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో బీఆర్ఎస్ సీనియర్ నేత, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రాముడు సింగిల్ విండో డైరెక్టర్లు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గట్టు మండలం నుంచి..

గట్టు, నవంబర్ 29 : గద్వాలలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'దీక్షా దివస్' కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బయలుదేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామునాయుడు, జయసింహారెడ్డి, వెంకటేశ్, కొళాయి భాస్కర్, తిమ్మప్ప, తిమ్మయ్య, రమేశ్ పాల్గొన్నారు.

వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

పాన్‌గల్ మండలం నుంచి..

పాన్‌గల్, నవంబర్ 29 : జిల్లాకేంద్రంలో మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మాజీజెడ్పీటీసీ లక్ష్మి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్‌నాయక్, వెంకటయ్య నాయుడు, దశరథ్‌నాయుడు, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం, కొత్తకోట మండలాల నుంచి..

మదనాపురం, నవంబర్ 29 : వనపర్తి జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి మదనాపురం, కొత్తకోట మండలాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మదనాపురం మండల అధ్యక్షుడు యాదగిరి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్ గౌడ్, మాజీ ఎంపీపీ గుంత మౌనిక, మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని విశ్వేశ్వర్, మాజీ జెడ్పీటీసీలు కృష్ణయ్య, బాలమణెమ్మ, సీడీసీ మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రావణ్‌కుమార్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు గుంత మల్లేశ్, యాదమ్మ, మదనాపురం, కొత్తకోట వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు వాసురెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, బాలకృష్ణ, రాజ్‌కుమార్, చాంద్‌పాషా, కరుణా కర్, శ్రీనివాసులు, సత్యంయాదవ్, మనోజ్‌కుమార్, కురుమూర్తి, శివశంకర్ ప్రవీణ్‌చారి తరలివెళ్లారు.

గట్టు నుంచి గద్వాల తరలుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

ధరూర్ మండల కేంద్రం నుంచి గద్వాల జిల్లా కేంద్రానికి తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

గోపాల్‌పేట తెలంగాణ విగ్రహం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అయిజ నుంచి గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించే దీక్షా దివస్‌కు తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

వనపర్తి జిల్లా కేంద్రానికి మదనాపురం నుంచి తరలివెళ్తున బీఆర్ఎస్ నాయకులు

పెబ్బేరు నుంచి వనపర్తికి బయలు దేరుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఖిల్లాఘణపురం, నవంబర్ 29 : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం 2009 నవంబర్ 29న దీక్ష దివస్ ప్రారంభించి 11రోజులు అమరణ నిరాహార దీక్ష చేసి తెలంగాణ రాష్ట్రం సాధించి 15 ఏండ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి జై తెలంగాణ అంటూ నినదించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు మాట్లాడుతూ తెలంగాణ మొదటి సీఎం, మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలో సాధించుకున్న తెలంగాణను దేశంలోనే అభివృద్ధిలో నెంబర్ వన్‌గా నిలిపిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ నీళ్లు, నిధులు, నియామకాలకు ప్రాధాన్యతనిస్తూ అన్ని రంగాల ప్రజల అభ్యున్నతికి తోడ్పాటునందించాడని గుర్తుచేశారు. కానీ అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తుచేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్లకృష్ణయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచులు కృష్ణయ్యగౌడ్, తిరుమలేష్, బాలస్వామి, మాజీ ఎంపీటీసీలు నాగయ్య, చుక్కన్న ,రవీందర్‌రెడ్డి, చిన్న ఆంజనేయులుగౌడ్, చెన్నారెడ్డి, కాశీనాథ్, దవాఖాన సత్యనారాయణ, బుచ్చిబాబుగౌడ్, ప్రతాప్, మహేశ్, రాఘువేందర్ రెడ్డి, రాఘువేందర్, మల్లారెడ్డి, పెద్ద ఆంజనేయులు గౌడ్, చెన్నయ్య, కురుమయ్య, చిన్న చెన్నయ్య ఉన్నారు.

రైతులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలి

- **కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి టౌన్, నవంబర్ 29 : మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం జరిగే రైతు పండుగ సంబురాలకు జిల్లా నుంచి బయలుదేరే రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి రైతు పండుగ సంబురాలకు తరలివెళ్లే రైతులకు చేయాల్సిన ఏర్పాట్ల పై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 30 న నిర్వహించే రైతు పండుగ సదస్సుకు గ్రామాల నుంచి రైతులు బయలుదేరేందుకు బస్సులో ఏర్పాటు చేయాలని, వారికి ప్రయాణానికి ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఇందుకోసం ఎంపీడీవోలు , ఎంపీవోలు నోడల్ అధికారులుగా ఉంటారని ఆదేశించారు. రైతులకు మధ్యాహ్న భోజనం కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పీసీఈవో యాద య్య, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీఏవో గోవింద్‌నాయక్, డీఆర్డీవో ఉమాదేవి, ఆర్టీసీ డీఎం, మున్సిపల్ కమిషనర్లు, ఏవోలు, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

పరిశుభ్ర వాతావరణంలో ఆహారం అందించాలి

- **జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బా రెడ్డి**

వనపర్తి టౌన్, నవంబర్ 29: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర ఏ,బి వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. వసతి గృహ ఆవరణం పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వంట చేసేటప్పుడు, తర్వాత వంటగదిని శుభ్రపరుచుకోవాలని, వంట చేసేందుకు, తాగడానికి ఫిల్టర్ వాటర్ మాత్రమే వాడాలని , బియ్యం , కూరగాయలు ఇతర సరుకుల నాణ్యతా విషయంలో రాజీపడొద్దని వార్డెన్, సిబ్బందికి ఆయన సూచించారు. ప్రతి రోజు స్టోర్ రూమ్, కిచెన్‌ను వసతి గృహ సంక్షేమ అధికారి పరిశీలించాలని, వంటకు వాడే వస్తువులు నాణ్యత లేకుంటే తిరిగి పంపించాలని సూచించారు. ఆహారం వండిన తర్వాత ఆభోజనం ఆహార కమి టీ సభ్యులు తిన్న తర్వాతనే విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి ఆంజనే యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

HOUSE FOR SALE
★LUXURIOUS INDEPENDENT HOUSE FOR SALE AT YENUGONDA, G+1. 150 Sq.Yrds., Prime location, secure neighborhood, all the essential amenities located nearby. Price : 1 crore, **Contact: 9966698792, 9505506523.**
NT- MBNR

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

- **కలెక్టర్ సంతోష్**

గద్వాల, నవంబర్ 29 : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను శుక్రవారం తనిఖీ చేసి మధ్యాహ్న భోజన నిర్వాహణను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు రోజు అందిస్తున్న భోజనం, వంట సామగ్రి, కిచెన్‌షెడ్, స్టాక్ గదులు, స్టోర్ గదిలో నిల్వ ఉంచిన బియ్యం, గుడ్లు, కూరగాయలు, పప్పు ఇతర సరుకుల నాణ్యతను, వాటి కాలపరిమితిని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందజేస్తున్నారా లేదా ఈ రోజు మెనూ ప్రకారం ఏమి చేశారని వంట సిబ్బందిని ఆరా తీశారు. తాజా కూరగాయలు, నాణ్యతగల సరుకులను మాత్రమే వంటకు వినియో గించాలని సూచించారు. వంటశాల ప్రదేశం, వంట పాత్రలు ఎప్పుడు శుభ్రంగా ఉండేలా చూసు కోవాలని ఆదేశించారు. నాసిరకమైన బియ్యం, కూరగాయలు ఇతర ఆహర పదార్థాలు సరఫరా చేసినట్లైతే తీసుకోవద్దన్నారు. భోజన నాణ్యతలో నిర్లక్ష్యం చేయవద్దని ఉపాధ్యాయులకు, వంటవారికి సూచించారు. సిబ్బంది ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా ఉంది మెనూ ప్రకారం వడ్డిస్తు న్నారా అని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట అధికారులు కాంతమ్మ, వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ భవాని పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ తనిఖీ

గోపాల్‌పేట, నవంబర్ 29: మండలకేంద్రంలోని పోలీస్టేషన్‌ను శుక్రవారం వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రికార్డులు, ఆవరణలో చుట్టూ ఉన్న ప్రదేశాలు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

వరికోత మిషన్ ఢీ కొన్ని వ్యక్తి మృతి

ధరూర్, నవంబర్ 29 : వరికోత మిషన్ ఢీ కొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని పార్‌చర్ల స్టేజీ సమీపంలో వరికోత మిషన్ పొలంలో నుంచి రోడ్డు వైపు వస్తున్న క్రమంలో గద్వాల పట్టణానికి చెందిన వడ్డె బీసన్న(34) రాయిచూర్‌లో కూలీ పని ముగించుకొని బైక్‌పై గద్వాలకి వస్తున్న సమయంలో ఢీ కొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో బీసన్నకు గాయాలు కావడంతో స్థానికులు చికిత్స కోసం గద్వాల ప్రభుత్వ దవాఖానకు తరలించే క్రమంలో మృతి చెందాడు. ఈ విషయంపై ధరూర్ ఎస్సై అబ్దుల్ షుకుర్‌ను వివరణ కోరగా. రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తన దృష్టికి వచ్చిందని పూర్తి సమాచారం సేకరిస్తున్నామని తెలిపారు.

పల్లెపాడులో మొసళ్ల కలకలం

మానవపాడు,నవంబర్29: కృష్ణానది పరివాహక ప్రాంతమైన మండలంలోని పల్లెపాడులో శుక్రవారం ఒక్కసారిగా మూడు మొసళ్లు కనిపించడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామం శివారులో గతంలో ఎర్రమన్ను తరలించడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. గోతులు నదికి ఆనుకొని ఉండడం గోతుల్లో నిండుగా నీరు ఉండడంతో మొసళ్లు గుంతల్లోకి వచ్చి చేరాయి. పొలాలకు వెళ్లిన రైతుల కంట పడడంతో గ్రామస్తులు అటువైపు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. మొసళ్ల సమాచారం ఉన్నతాధిధిరులకు చేరవేశామని వెంటనే వాటిని బంధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అలంపూర్ చౌరస్తా, నవంబర్ 29 : ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా పంచలింగాల గ్రామానికి చెందిన బాబు తుంగభద్రానది నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా అలంపూర్‌చౌరస్తా సమీపంలో జాతీయ రహదారిపై జియో పెట్రోల్‌బంకు వద్ద గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని ఉండవల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ బాబు, ట్రాక్టర్ యజమాని రాకేశ్‌పై కెసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతో కోమాలోకి రోగి

- **మెదడులో నరాలు చిట్లిపోయిన్నట్లు నిర్ధారణ**
- **రాజీకి ప్రయత్నాలు చేస్తున్న వైద్యులు**

గద్వాల అర్బన్, నవంబర్ 29 : వైద్యుల నిర్లక్ష్యంతో ఓ మహిళ కోమాలోకి వెళ్లింది. అయిజ పట్టణానికి చెందిన కవిత(30) శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉండడంతో జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ దవాఖానను ఆశ్రయించింది. వైద్యులు ముక్కులో గడ్డ ఉందని ఆపరేషన్ చేసి తీసేయా లని, అందుకు రూ.20వేలు ఖర్చు అవుతుందని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు అంత డబ్బు ఇవ్వలేమని చెప్పడంతో వైద్యులు రూ.15వేలకు బేరం కుదుర్చుకున్నారు. అనంతరం వైద్యులు కవితకు ఎలాంటి ఆరోగ్య, రక్త పరీక్షలు నిర్వహించకుండా ఆపరేషన్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఆపరేషన్ కంటే ముందు వైద్యులు కవితకు మత్తు ఇంజెక్షన్ ఇవ్వడంతో ఒక్కసారిగా రోగికి ఫిట్స్ వచ్చాయి. దీంతో రోగి పరిస్థితి విషమించి కోమాలోకి వెళ్లడంతో వైద్యులు అంబులెన్స్ ఏర్పాటు చేసి రోగిని కర్నూల్ దవాఖానకు తరలించినట్లు సమాచారం. కర్నూల్ దవాఖానలో చికిత్స పొందుతున్న కవితకు స్పృహ రాకపోవడంతో వైద్యులు పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించగా మెదడులో నరాలు చిట్లిపోయినట్లు గుర్తించి రోగి బంధువులకు తెలిపారు. ఇప్పట్లో కోమాలో నుంచి బయటకు వచ్చే అవకాశం లేదని ఇంటికి తీసుకెళ్లాలని వైద్యులు చెప్పడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్య కారణంగానే ఈ ఘటన జరిగిందని కవిత కుటుంబ సభ్యులు అరోపిస్తున్నారు. ఈ విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు రోగి కుటుంబ సభ్యులతో ప్రైవేట్ దవాఖాన వైద్యులు రాజీ కుదుర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎంత కావాలంటే అంత..ఇస్తాం..రాజీ పడాలని రోగి కుటుంబ సభ్యులు బేరాసారాలు జరుపుతున్నట్లు గుసగుసలు వినబడుతున్నాయి. ఈ విషయానికి వార్త సంబంధించి గురువారం నమస్తే తెలంగాణ పత్రికల్లో రావడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సిద్ధప్ప స్పందించి ఘటనపూ విచారణ చేశారు. వైద్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఘటనకు సంబంధించి ఓ ప్రత్యేక అధికారుల బృందంతో పూర్తిస్థాయిలో విచారిస్తామని తెలిపారు.

హామీలను అమలు చేయకపోతే సమ్మెకు దిగుతాం

- **సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన**

అయిజ, నవంబర్ 29 : సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు నిరసన తెలిపారు. విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ మండల అధ్యక్షురాలు అనురాధ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా రెగ్యులర్ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. హన్మకొండలో జరిగిన సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల దీక్ష శిబిరంలో స్పష్టమైన హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి హామీని నెరవేర్చకపోవడంతో దశల వారీగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 18న విద్యాశాఖ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇచ్చామని, అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం ఎంఈవో రాములకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రఘు, చెన్న బసమ్మ, శ్రీనివాసులు, ఉదయ్‌కిరణ్, తిరుమలేష్, స్వాతి, వీరుపాక్షమ్మ, శాంతమ్మ, శ్రీదేవి, హసియా, శ్రావణ్, బాబు, ప్రణీత పాల్గొన్నారు.

అయిజ ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు

కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

గోపాల్‌పేట, నవంబర్ 29 : మండలకేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వందరోజుల్లోనే సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, వెంటనే పేస్కేల్ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పటివరకు ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వహీద్, శ్రీనాథ్, రమేశ్, మోహన్, ఈశ్వర్, మహేశ్, అరుణ, మంజుల పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల బ్రోచర్ విడుదల

మల్దకల్, నవంబర్ 29 : ఆదిశిలా క్షేత్రంలో తిమ్మప్ప స్వామి బ్రహ్మోత్సవాలు డిసెంబర్ 5 నుంచి 17 వరకు నిర్వహించనున్న సందర్భంగా శుక్రవారం ఆలయంలో ఉత్సవాల బ్రోచర్లు ఆలయ ఆవరణలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆవిష్కరించారు. అనంతరం స్వామి వారి ప్రచార రథ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, సీతారామిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, విక్రమసింహారెడ్డి, మాజీ సర్పంచ్ యాకోబు, నరేందర్, అరవిందరావు, బా బురావు, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటన్న, ఉప్పరి నారాయణ, పరశురాముడు, తిమ్మరాజు, చంద్రశేఖర్‌రావు, ఆర్యవైశ్య సభ్యులు నాగరాజు, శ్రీనివా సులు, వెంకటేశ్ శెట్టి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండాచూసుకోవాలి

గద్వాలటౌన్, నవంబర్ 29: పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాష్ట్ర ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్ మెంబర్ అంజన్‌రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, బాలల సంరక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలల పరిసర ప్రాంతాలను, బాత్‌రూంలలు, భోజనశాలను తనిఖీ చేశారు. 1200మంది ఉన్న బాలుర పాఠశాలల్లో సరైన బాత్‌రూం వ్యవస్థ లేకపోవడంపై అసహనాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులకు తగ్గ బాత్‌రూంలను వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను కలెక్టర్, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఏవైనా సమసస్యలు ఉంటే చైల్డ్‌హెల్ప్ లైన్ 1098కి కాల్ చేయాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట జిల్లా శిశు సంక్షేమ అధికారి సుధారాణి, బాలల సంరక్షణ కమిటీ చైర్మన్ సహదేవుడు, సీడీపీవో వెంకటేశ్వరి, డీసీపీయూ కౌన్సిలర్ సురేశ్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మల్దకల్, నవంబర్ 29 : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని బిజ్వారం గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్సై నందికర్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన శాంతన్న (68) గురువారం తన కూతుళ్లు, అల్లుడుతో కలిసి పొలం వద్ద ఉండగా ఆకస్మాతుగా కింద పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే గద్వాల్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు.

అంబులెన్స్‌కు అడ్డం పడుకున్న మహిళ

అయితే మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి గ్రామానికి తరలించే క్రమంలో అమరవాయి గ్రామ స్టేజీ వద్ద మృతుడి ముగ్గురు కూతుళ్లు అంబులెన్స్‌కు అడ్డం పడి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కూతుళ్ల కథనం ప్రకారం శాంతన్న కుమారుడు గోకారి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేసే వాడు. కాగా కొన్నేండ్ల కిందట అనారోగ్యానికి గురికాగా భార్య అతడిని వదిలి తన పుట్టింటికి వెళ్లింది. దీంతో గోకారికి అప్పటి నుంచి తల్లిదండ్రులు, అక్కలు సేవలు చేశారు. ఈ క్రమంలో రెండేళ్ల కిందట గోకారి మృతిచెందాడు. గోకారి మృతితో భార్య లక్ష్మీదేవికి ప్రభుత్వ కొలువు రావాల్సి ఉంది. అయితే శాంతన్న కుమార్తెలు తమ తమ్ముడికి అనారోగ్యంతో ఉంటే కొన్నిరోజులు మేమే సేవ చేశామని ఆ ఉద్యోగం తమకే రావాలని లక్ష్మీదేవి కుటుంబ సభ్యులతో గొడవలు పడుతున్నారు. కాగా నెల కిందట పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా ఏటు తేలలేదు. ఇప్పుడు మా తండ్రి చనిపోయాడు మాకు ఎవరి అండ ఉండదు అందుకని ప్రభుత్వం ఉద్యోగం మాకే ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తూ అంబులెన్స్ అడ్డం పడుకున్నారు. దీంతో పోలీసులు అక్కడి చేరుకొని వారికి నచ్చజెప్పి మృతదేహాన్ని బిజ్వారం గ్రామానికి తరలించారు. ఈ ఘటనను అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.